

తలంబ్రాలు, పట్టువస్త్రాలు, తీసుకువస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు

# కల్యాణ వైభోగమే



కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తజనం

ఇని కోదండ రామాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులు

**పచ్చని పందిరి, మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. జిల్లాలోని పలు ఆలయాల్లో వేలాది మంది భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయాల ప్రాంగణాలు జైశ్రీరాం నామస్మరణలతో మార్మోగాయి. ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.**

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం గోదావరిఖని కోదండ రామాలయంలో అంగరంగవైభవంగా జరిగింది. మినీ భద్రాచలంగా పేరొందిన కోదండ రామాలయం ఆవరణలో కల్యాణ వేదికపై వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని వేలాది మంది భక్తజనం కన్నులారా వీక్షించి తరించారు. జైశ్రీరామ నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. కల్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు మధుసూధనాచార్యులు, అర్చకులు అత్తెణచంద్ర శేఖరశర్మ, గిరిధరాచార్యులు, శశిధరాచార్యులు కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్-మనాలీఠాకూర్ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ దంపతులు, ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, కె.రవీందర్ సీతారాములను దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే ఆలయ కమిటీతో ఏర్పాట్లు చేయించారు. ఎండ తీవ్రతకు ఇబ్బంది పడకుండా కూలర్లు ఏర్పాటుచేశారు. మాజీ కార్పొరేటర్లు మహంకాళిస్వామి, బొంతల రాజేష్, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ గట్ల రమేష్, సభ్యులు, ఉల్లంగుల రమేష్, ఈవో, సిబ్బంది పాల్గొన్నారు. ఏసీపీ మడత రమేష్ పర్య వేక్షణలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బం దులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. పలు స్వచ్ఛంద సంఘాలు భక్తులకు ఉచితంగా మజ్జిగ, బెల్లంపానకం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు సేవలు అందించారు.

### అండగా ఉంటా...సేవ చేస్తా
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



కల్యాణ వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నియోజకవర్గ ప్రజలపై సీతారామచంద్ర స్వామి ఆశీస్సులుండాలని ఎమ్మెల్యే మక్కాన్‌సిం గ్ రాజ్‌ఠాకూర్ కోరుకున్నారు. రామగుండం నియోజకవర్గానికి హనుమంతుడిలా అండగా ఉంటానని, సేవలందిస్తానని చెప్పారు. ఆదివారం కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్-మనాలీఠాకూర్ దంపతులు పట్టువస్త్రాలు సమ ర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణోత్సవం లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వచ్చే ఏడాది మరింత ఘనంగా వేడుకలు నిర్వ హిస్తామని, రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద 300 ఫీట్ల భారీ అంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నానని, కోదండ రామాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకుసాగాలన్నారు.

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణం
- జైశ్రీరాం నామస్మరణలతో మార్మోగిన ఆలయాలు
- అన్నదానం, ప్రసాదాల వితరణ

కాకతీయనగర్‌లోని అభయాంజనేయస్వామి, చంద్రశేఖరనగర్‌లోని ఆంజనేయస్వామి, జీఎంకాలనీలోని సంజీవాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. మార్కండేయ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ˆక్తాంజనేయ స్వామి ఆలయంలో దాతల సహకారంతో కల్యాణం నిర్వహించారు.

**పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. అప్పన్నపేట రామాలయం, అందుగులపల్లి, రాఘవపూర్, కనగర్తి, కాపులపల్లి, పెద్దకల్వల, కొత్తపల్లి, రంగాపూర్, బొంపల్లి, దేవునిపల్లి, పెద్దబొంకూర్, నిట్టూరు, తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట, భోజన్నపేట, మూలసాలతో పాటు పలు గ్రామాల్లో కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాలను ముస్తాబు చేసి కల్యాణాన్ని భక్తులు తిలకించే విధంగా ఏర్పాట్లుచేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కాల్వశ్రీరాంపూర్‌లో జగత్ మహామునీశ్వరస్వామి, హరిహరదేవాలయం, రామాలయం, శివాలయం, కూనారం, పెగడపల్లి, మీర్జంపేట, మొట్లపల్లి, మంగపేట, పందిళ్ల, వెన్నంపల్లి, గంగారం ఆలయాల్లో సీతారాముల కల్యాణం వేద పండితులు నిర్వహించారు. హైకోర్టు లాయర్ దంపతులు సునీత అశోక్‌రాజ్, మాజీ జడ్పీటీసీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మొగిలి, మాజీ సర్పంచ్ సుజాత రమేష్ పాల్గొన్నారు.

**ఓదెల, (ఆంధ్రజ్యోతి):** భ్రమరాంబ మల్లికా ర్జున స్వామి క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈవో సదయ్య పట్టువస్త్రాలను సమర్పించగా, అర్చకులు ఆరుట్ల శ్రీనివాసచార్యులు, నరసింహచార్యులు కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు సినీ నిర్మాత నంది సంపత్, భవాని దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గుంపుల రామభద్రాలయంలో భక్తులకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ లడ్డు ప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరయ్యారు. గుంపులకు చెందిన ఆటో డ్రైవర్లు రాజు, అనిల్, తిరుపతి, సదయ్య, శ్రీధర్ తోపాటు ఓదెలకు చెందిన మరో ముగ్గురు డ్రైవర్లు దర్శనానికి వస్తున్న భక్తులకు ఉచిత ఆటో ప్రయాణాన్ని కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

**ధర్మారం, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామాలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులను నిర్వాహకులు పూస్కూరి జితేందర్‌రావు, పద్మజ సత్కరించారు. పాలకుర్తి రాజేశం, రేణుక, కాంపెల్లి రాజేశం, ఒడ్నాల శంకరయ్య, కొత్త నర్సింహులు, ఓరెం చిరంజీవి, దేవి లావణ్య, ఉన్నారు.

**జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి):** ఎన్టీపీసీ పీటీఎస్‌లోని హనుమాన్ ఆలయంలో జానకిరాముల వివాహ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈడీ చందన్ కుమార్ సామంత, రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మల్కాపూర్ హనుమాన్ ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, సీపీ అంబర్ కిశోర్‌ఝా హాజరయ్యారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎండి రహీం, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. టీటీఎస్, భీమునిపట్నం, కృష్ణానగర్‌లో కల్యాణాన్ని జరిపించారు.

**మంథని, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికలపై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో వొడ్నాల శ్రీనివాస్-ప్రవళిక, కొమురవెల్లి విజయ్‌కుమార్-సునీత దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు, **మిగతా 8వ పేజీలో**



మంగళసూత్రం చూపిస్తున్న కోదండ రామాలయం ప్రధానార్చకులు



ముత్తారంలో రాములవారి కల్యాణం జరుపుతున్న వేదపండితులు



ఎన్టీపీసీ కల్యాణోత్సవంలో పాల్గొన్న సీపీ అంబర్ కిశోర్ ఝా



సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు



ఓదెలలో మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహిస్తున్న పురోహితులు



కాలనీ వేంకటేశ్వరాలయంలో సీతారాముల కల్యాణం

---

మహనీయుల స్ఫూర్తితో

## సామాజిక అణిచివేతపై పోరాడాలి

**సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి**



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక ఉద్యమ నిర్మాత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటి రణదీవే వర్ధంతిని ఆదివారం సీఐటీయూ ఆఫీసు శ్రామికభవన్‌లో నిర్వహించారు. రణదీవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'సామాజిక న్యాయం- సీఐటీయూ అవగాహన' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ బీటీ రణదీవే స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని, ఆ సమయంలోనే కార్మిక వర్గాన్ని సంఘటితం చేశారన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి, ఐక్య పోరాటాలు నిర్మించడంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కార్మికవర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారని, దేశంలో సామాజిక అణిచివేత, కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, కార్మిక వర్గం పోరాడాలని నిర్దేశించిన నాయకుడు బీటి రణదీవే అని అన్నారు. ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాద విధానాలను అనుసరిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు మెండె శ్రీనివాస్, ఆర్జీ-1 అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, నాయకులు తోట నరహరిరావు, మహేష్, దాసరి సురేష్, రాములు, ఈదుల సాగర్, బండ్ర మహేశ్వరి, టీ సుజాత, బీ రజిత, వాణి, వాసవి, నర్సమ్మ, శంకరమ్మ, తిరుపతి పాల్గొన్నారు.

### పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

గోదావరిఖని, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించాలనే సన్న బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. స్థానిక 49వ డివిజన్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గడం లేదన్నారు. ఇప్పటికే మహాలక్ష్మితోపాటు 200యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీని అందిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ సనాఫక్రుద్దీన్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

## దేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యం

- జిల్లాలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడమే బీజేపీ ముఖ్య ఉద్దేశ్యమని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జెండాను ఎగురవేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావించినప్పటి నుంచి ఒడిదొడుకులను అధిగమించుకుంటూ పుంజుకుందని తెలిపారు. ప్రధాని మోదీ మొండి ధైర్యంతో జమ్మూకశ్మీర్‌లో 37 ఆర్టికల్‌ను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

**రెండు తడులు సాగునీరు ఇవ్వాలి**

ఎస్సారెస్పి డి-83, 86 కెనాల్ ద్వారా ఆధార పడి ఉన్న రైతులకు రెండు తడులు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిమ్మనపల్లిలో దుగ్యాల ప్రదీప్‌కుమార్ జెండాను ఎగురవేశారు. ప్రదీప్ మాట్లాడుతూ నీరు అందకుంటే పంటలు పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతులకు మరొక తడి సాగునీటిని విడుదల చేయాలని వారు పేర్కొన్నారు. రాజేశ్వర్‌రావు మేకల శ్రీనివాస్, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, పోల్సాని సంపత్‌రావు, ఈర్ల శంకర్, ఒల్లే తిరుపతి, రాజం మహంత కృష్ణ, ఓదెల మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మహేందర్, పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాలతో కాసుల పంట

- కార్పొరేషన్ ఆదాయం అధికారుల జేబుల్లోకే
- డిస్పోజల్ పేరిట గతంలో సేకరణకు అనుమతి
- కరీంనగర్‌లో యేటా రూ.20లక్షల ఆదాయం, రామగుండంలో రూ.90వేలే...

6



చికెన్ షాపుల నుంచి వ్యర్థాల సేకరణ


ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, POTHARAM PAVAN, S/O. POTHARAM DEVAIAH, H.NO. 5-2-8, UPPUGADDA (V), VEMULAWADA (M), RAJANNA SIRICILLA (D). MY PASSPORT NO. P2803640.IN MY PASSPORT MY WIFE NAME ENTERED AS " POTHARAM JAHNAVI " BUT HER CORRECT NAME IS " POTHARAM PADMA "

AJK-16670

**WANTED**

★ శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పనిచేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899.

AJH-003142

**3+2 స్కీం కలదు**

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్: 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238


## గరీబ్ కళ్యాణ్ అన్నయోజనతోనే సన్నబియ్యం

- రేషన్ షాపు ఎదుట మోదీ చిత్రపటం పెట్టాలని డిమాండ్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ప్రతి పేదవాడికి 5 కిలోల సన్నబియ్యం అందజేస్తుందని బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని పలు రేషన్ షాపులను బీజేపీ నాయకులు సందర్శించి రేషన్ షాపు ఎదుట మోదీ చిత్రపటం పెట్టాలని డీలర్లను డిమాండ్ చేశారు. చిత్రపటాన్ని పెట్టే వరకు షాపుల నుంచి వెనుదిరిగి వెళ్ళేది లేదని పట్టుపట్టారు. రేషన్‌షాపు ఎదుట మోదీ చిత్రపటాన్ని, పథకం వివరాలను తెలియజేసేలా బోర్డులు పెట్టారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న 5కిలోల ఉచిత బియ్యానికి కేవలం ఒక కిలో బియ్యాన్ని అందజేస్తూ మొత్తం రాష్ట్ర ప్రభు త్వమే అందజేస్తుందని అబద్ధపు ప్రచారం చేస్తుందన్నారు. సొమ్మొకరిది సోకొకరిది అన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం విధానం ఉందని ఎద్దేవా చేశారు. నాయకులు కోమళ్ళ మహేష్, కొండపర్తి సంజీవ్, విశ్వాస్, ఆకాశ్, రంజిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపు ఎదుట మోదీ చిత్రపటాన్ని, పథకం వివరాల బోర్డుతో బీజేపీ నాయకులు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గడి రవి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. మంథని పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన గడి రవి, ఎరుకలగూడెంకు చెందిన మాసినేని శేఖర్‌లు మండలంలోని వెంకటాపూర్ వెళ్ళి తిరిగి బైక్ పై మంథనికి వస్తుండగా ఎదరుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో రవి మృతిచెందాడు. మృతిచెందిన రవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మంథనిరూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన దుర్కి కొమురయ్య (45) అనేవ్యక్తి శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న కొమురయ్యకు రెండేళ్ళుగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడడంతో భార్య ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో కొమురయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 10గంటల సమయంలో ఇంటికి వచ్చిన భార్య చూడగా కొమురయ్య ఆత్మహత్య చేసుకొని ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చికెన్ వ్యర్థాలతో కాసుల పంట



- కార్పొరేషన్ ఆదాయం అధికారుల జేబుల్లోకే...
- డిస్పోజల్ పేరిట గతంలో సేకరణకు అనుమతి...
- కరీంనగర్‌లో యేటా రూ.20లక్షల ఆదాయం... రామగుండంలో రూ.90వేలే...
- వ్యర్థాలు సేకరణపై కార్పొరేషన్ అజమాయిషీ లేదు...
- రేటు ఎక్కువ పెడతామంటూ కార్పొరేషన్ చుట్టూ తిరుగుతున్న వ్యాపారులు...

కోల్‌సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలు ఒకప్పుడు మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు భారంగా మారేది... ఇప్పుడు అదే ఆదాయ వనరుగా మారింది. చేపల చెరువుల అభివృద్ధి తరువాత చికెన్ వ్యర్థాలతో ఆక్వా ఫీడింగ్ తయారీ పరిశ్రమలు వెలిశాయి. దీంతో ఈ వ్యర్థాలను మున్సిపాలిటీల నుంచి కొనుగోలు చేసే పరిస్థితులు వచ్చాయి. ఐదేళ్లుగా మున్సిపాలిటీల్లో చికెన్ వ్యర్థాలకు భారీ డిమాండ్ ఉంది. ఆక్వా పరిశ్రమలు, చికెన్ వ్యర్థాలతో నూనెలు తయారు చేసే పరిశ్రమలకు సంబంధించిన ఏజెన్సీలు టెండర్లను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులను మచ్చిక చేసుకుని దొడ్డిదారిన ఆర్డర్లు పొంది మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నాయి. రామగుండం నగరపాలక సంస్థలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. యేటా రూ.20లక్షల నుంచి రూ.25లక్షల ఆదాయం రావాల్సి ఉండగా కేవలం రూ.90వేలతోనే సరిపెట్టారు. రామగుండం నగరపాలక సంస్థ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ నియమావళి పాటించకుండా ఒక ఏజెన్సీకి సేకరణ బాధ్యతలు అప్పగించింది. తరువాత ఆ ఏజెన్సీ నిబంధనలు పాటిస్తుందా లేదా అనే అజమాయిషీ చేసే పరిస్థితి కూడా లేదు. రామగుండం నగరపాలక సంస్థలో 250లకు పైగా చికెన్ సెంటర్లు ఉంటాయి. రోజు టన్నుల కొద్ది వ్యర్థాలు చికెన్ సెంటర్లలో పోగవుతాయి. బుధ, ఆదివారాల్లో ఈ వ్యర్థాలు రెట్టింపు స్థాయిలో ఉంటాయి. వీటిని గుర్తింపు పొందిన ఆక్వా ఫీడింగ్ తయారీ పరిశ్రమలకు సరఫరా చేసే ఏజెన్సీలకు మాత్రమే వేస్టేజ్ తరలింపు పనులు అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకు మున్సిపాలిటీలకు వేస్టేజ్ బరువును బట్టి ఫీజు చెల్లిస్తారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను అనుసరించి ఈ సేకరణ జరుపాల్సి ఉంటుంది. చిన్న మున్సిపాలిటీల్లో అయితే ఏజెన్సీలను పిలవడం, పెద్ద మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలోనైతే ఇంజనీరింగ్ విభాగం నుంచి టెండర్లను పిలుస్తారు. కానీ రామగుండంలో మాత్రం ఈ నిబంధనలు ఎక్కడా పాటించలేదు. ఏకంగా ఒక ఏజెన్సీకి వ్యర్థాల డిస్పోజల్‌కు ఆర్డర్ ఇచ్చారు. అది కూడా శానిటేషన్ విభాగం నుంచి ఆర్డర్ తయారు చేశారు. చికెన్ వ్యర్థాలను డిస్పోజల్ చేసేందుకు ఒప్పుకుందని, అందుకు గాను కార్పొరేషన్ పరిధిలోని 139షాపుల నుంచి 2023-2025 ఆర్థిక సంవత్సరాలకు గాను ఒక్కో షాపునకు రూ.1400 చెల్లిస్తుందని ఆర్డర్‌లో పేర్కొన్నారు.

**● కరీంనగర్‌లో యేటా రూ.20లక్షలు...**

చికెన్ వ్యర్థాలకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. చికెన్ వ్యర్థాలతో ఆక్వా ఫీడింగ్ తయారు చేసే కంపెనీలు గ్రామీణ స్థాయి నుంచి ఏజెన్సీలను పెట్టి సేకరణ చేస్తున్నాయి. చికెన్ షాపుల నిర్వాహకులకు, స్థానిక సంస్థలకు ఫీజులు కూడా చెల్లిస్తున్నారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి అయితే రోజు పెద్ద ఎత్తున వ్యర్థాల సేకరణకు అవకాశం ఉండడంతో పలు పరిశ్రమలు పోటీ పడుతున్నాయి. దీంతో ఏజెన్సీలు మున్సిపాలిటీలపై ఒత్తిడి తేవడంతో టెండర్లు పెట్టారు. కరీంనగర్‌లో యేటా రూ.20లక్షల ఆదాయం సమకూరుతుంది. రామగుండం నుంచి ఇంకా పెద్ద ఎత్తున వ్యర్థాలు తరలిస్తున్నట్టు తెలుస్తున్నది. రామగుండానికి కూడా ఈ ఆదాయం ఏటా రూ.25లక్షలు దాటే అవకాశం ఉంది. కానీ కొందరు అధికారులు భారీగా గండి కొట్టారు.



**● చికెన్ వ్యర్థాలను తరలించేవారెవరు...**

రామగుండం నుంచి గతంలో చికెన్ వ్యర్థాల తరలింపును ఒక ఏజెన్సీకి అప్పగించారు. అది కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. ఆ ఏజెన్సీకి ఇచ్చిన గడువు కూడా ముగిసిందని యంత్రాంగం పేర్కొంటున్నది. కానీ రామగుండంలో మాత్రం రోజు వెలువడుతున్న వ్యర్థాలు తీసుకెళుతూనే ఉన్నారు. నగరపాలక సంస్థ మాత్రం దీనిపై స్పందించడం లేదు.

**● వ్యర్థాల తరలింపుపై అజమాయిషీనే లేదు...**

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చికెన్ వ్యర్థాలను సేకరించే విషయంలో నగరపాలక సంస్థ అజమాయిషీ చేయాల్సి ఉంటుంది. తరలింపు ఏజెన్సీల నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు, రోజు ఎంత సేకరిస్తున్నారు, దారి మళ్లిస్తున్నారా అనే విషయాలపై పరిశీలించాల్సి ఉంటుంది. రోజు సేకరించిన వ్యర్థాలకు సంబంధించి రికార్డు తయారు చేసి కాలుష్యనియంత్రణ మండలికి పంపాల్సి ఉంటుంది.

**మాకు సమాచారమే లేదు...**

**నాగభూషణం, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

చికెన్ వ్యర్థాల తరలింపుపై మాకు ఎలాంటి సమాచారం లేదు. ఇంజనీరింగ్ విభాగానికి సమాచారం ఉండే అవకాశం ఉంది. మేము వ్యర్థాల గురించి మానిటరింగ్ చేయడం లేదు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

● తప్పిన పెనుప్రమాదం



ఒకవైపునకు ఒరిగిన స్తంభం

మల్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి నూకపల్లి-రామన్నపేట వెళ్లేమార్గం మూల మలుపులోగల హైమాస్ట్ లైట్ల పోల్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో స్తంభం వంగిపోగా త్రుటిలో ప్రమాదం తప్పింది. పక్కనే విద్యుత్ తీగలు ఉండగా వాటిపై పడితే ప్రమాదం చోటు చేసుకునేది అని నూకపల్లి గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రాంతంలో రహదారివిస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన వాహనాలు ఇష్టారీతిన వెళ్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, ఉపాధ్యాయుల పెన్షనర్ల కార్మికుల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ పెండింగ్, మెడికల్ బిల్లులు, 5డీఏలు, 317జీవో ద్వారా ఎంతోమంది ఉద్యోగులు ఇప్పటివరకు మానసికంగా కుమిలిపోతున్నారన్నారు.

## సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణధీవే వర్ధంతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి ): మహనీయుల స్ఫూర్తితో సామాజిక అణచివేతపై పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. భారత కార్మిక ఉద్యమ నిర్మాత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే వర్ధంతి సందర్భంగా శాంతినగర్ సిఐటియు కార్యాలయంలో రణదీవే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ రణదీవే విద్యార్థి దశనుంచే జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారని, స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని, ఆ సమయంలోనే కార్మిక వర్గాన్ని సంఘటితం చేశారన్నారు. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడిగా దేశంలో కార్మికవర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. నాయకులు జి, జ్యోతి, సీపెల్లి రవీందర్, ఎండిఖాజా, నాగయ్య, ఆకుల రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బీటీ రణధీవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

## మాతా శిశు కేంద్రంలో ఆక్సిజన్ ప్లాంట్

● రోగులకు అత్యవసర సమయాల్లో తీరనున్న కష్టాలు



జగిత్యాల మాతా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు కేంద్రంలో 21లక్షల రూపాయల నిధులతో ఆక్సిజన్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మాత శిశు కేంద్రంతోపాటు త్వరలో ప్రారంభం కానున్న 50పడకల క్రిటికల్‌కేర్ యూనిట్‌లో రోగులకు ఆక్సిజన్ కొరత తీరనుంది. ప్రస్తుతం రోగులకు అత్యవసర సమయంలో ఆక్సిజన్ అవసరం అయితే సిలిండర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మాతాశిశు కేంద్రంలో చిన్నారులకు, బాలింతలకు అనేక సందర్భాల్లో ఆక్సిజన్ అవసరం అవుతుంది. చాలాసార్లు బాలింతలకు ఆక్సిజన్ అవసరం అవుతుంది. ప్లాంట్ ఏర్పాటుతో సిలిండర్ కష్టాలు తీరనున్నాయి. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం అయితే ప్రధానాసుపత్రిలోని అనేకసేవలు ఇక్కడికి మారనున్నాయి. సర్జరీలు, ప్రమాదాల బారిన పడిన వారికి కూడా క్రిటికల్ కేర్‌లోనే చికిత్స అందించాల్సి ఉంటుంది. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుతో ఆక్సిజన్ కొరత తీరనుంది. ఆక్సిజన్ ప్లాంట్ పైప్‌లైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో పది రోజుల్లో రోగులకు అందుబాటులోకి రానుంది.

**● తీరనున్న ఆక్సిజన్ సమస్య**

**- డాక్టర్ సుమన్, ఆసుపత్రి సూపరింటెండెంట్**

పది వేల లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి ఆరోగ్య శాఖ నిధుల నుంచి 21 లక్షల రూపాయలను వెచ్చించాం. పదివేల లీటర్‌ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్‌లో లిక్విడ్ ఆప్షన్ ఆక్సిజన్ నింపుతారు. ఈ ప్లాంట్ నుంచి ఏవి కాయిల్ ద్వారా డిస్ట్రిబ్యూటరీ సిస్టం నుంచి మాత శిశు కేంద్రానికి మరియు క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఆక్సిజన్ సరఫరా అవుతుంది.

## జలాశయాలు, చెరువుల వద్ద భద్రత డొల్ల

- గాలిలో కలుస్తున్న అమాయకుల ప్రాణాలు
- లేక్ పోలీస్, బ్లూకోల్ట్స్ గస్తీపై విమర్శలు
- పట్టించుకోని ఎస్సారెస్పీ, చెరువు కమిటీలు
- జాడలేని ప్రాజెక్టు లష్కర్, వాచ్‌మెన్



కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల వద్ద భద్రత డొల్లగా మారింది. ముఖ్యంగా వేసవిలో జలాశయాలు, చెరువులు, కుంటలు, వాగుల్లో ఈత, స్నానంకోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోమునిగి మృత్యువాత పడుతున్నారు. ప్రతీవేసవిలో జిల్లావ్యాప్తంగా 10 మంది వరకు ప్రాణాలు కోల్పతున్నారు. శనివారం ఓ యువకుడు తన పెంపుడు కుక్కతోపాటు మానేరు జలాశయంలో నీట మునిగి మరణించాడు. మార్చి 29న రేకుర్తిలోని పెంటమ్మ చెరువు వద్దకు పెంపుడు కుక్కతో వెళ్లిన బాలిక దానిని రక్షించబోయి ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడింది. వారంరోజుల వ్యవధి రెండు నిండుప్రాణాలు గాలిలో కలిశాయి. ఫిబ్రవరి 28న మానేరు జలాశయంలో ఈతకువెళ్లిన రవీందర్‌రావు అనే ఆర్టీసీ ఉద్యోగి నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు, కూలీలు, ఇతరులు పని నుంచి ఉపశమనం పొందడానికి అందుబాటులో ఉన్న కరీంనగర్‌లో శివారులోని మానేరు జలాశయం వద్దకు వస్తుంటారు. పరీక్షలు ముగియడం, వేసవి సెలవులతో విద్యార్థులు కూడా జలాశయాన్ని సందర్శించడానికి భారీ సంఖ్యలో వస్తుంటారు. జలాశయంలో మట్టితొలగించిన బొందలు, నీటి లోతు, నాచు, బుడుగులు ప్రమాదకరంగా మారి ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలలో కంచె, సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో సంఘటనలు సంభవిస్తున్నాయి. విషయం తెలిసినా ప్రాజెక్టు అధికారులు, పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేయలేదు. దిగువ మానురు జలాశయం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి పదుల సంఖ్యలో లస్కర్‌లు, వాచ్‌మెన్‌తోపాటు సూపర్‌వైజర్, ఏడీ తదితరులు ఉన్నా జాడ లేదు. వీరంతా కేవలం డ్యాం కట్టపై నామమాత్రంగా విధులు నిర్వహిస్తూ వేల రూపాయల వేతనాలు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగిన సమయాల్లో ఒకటి రెండు రోజులు భద్రతను ఏర్పాటు చేసి ఆ తరువాత వదిలేయడంతో సంఘటనలు పునరావృతమవుతున్నాయి. మానేరు జలాశయం వద్ద శాశ్వతంగా ఒక అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తేనే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, ప్రాజెక్టు అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా బందోబస్తు చర్యలను చేపట్టాలని కోరుతున్నారు.

**● లేక్ అవుట్‌పోస్ట్‌లో సిబ్బందిలేమి.. నామమాత్రపు గస్తీ..**

మానేరు జలాశయం వద్ద ప్రమాదాలు జరుగకుండా లేక్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినా కొంత కాలంగా సిబ్బందిలేమితో గస్తీ నామమాత్రంగా ఉంటోంది. ఇంతకుముందు లేక్ అవుట్ పోస్ట్‌లో ఒక ఎస్‌ఐతోపాటు ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు వంతులవారీగా రౌండ్ ద క్లాక్ కట్టపై పెట్రోలింగ్ నిర్వహించేవారు. లేక్ పోలీసుల వద్ద ఒక డ్రోన్‌కెమెరా, బైనాక్యులర్, పెట్రోలింగ్ సైకిళ్లు, బైక్‌లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అవేవి కనపడడంలేదు. అసలు లేక్ అవుట్‌పోస్ట్ ఉన్నట్లా? లేనట్లా? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డ్యాం కట్టపై పెట్రోలింగ్ లేక పోవడంతో వేకువజామున జనం వాకింగ్‌కు రావడం తగ్గించారు. మరో వైపున డ్యాంకట్టపై విపరీతంగా కుక్కల బెడద ఉంది. డ్యాం కట్టపై ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు ఒక రోజు పనిచేస్తే రెండు రోజులు మొరాయిస్తాయి. సమస్యలను పరిష్కరించి భద్రత కల్పించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన కనపడడంలేదని వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికయినా ప్రభుత్వ అధికారులు సమన్వయం చేసుకొని జలాశయం వద్ద భద్రతను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం**

- ఏటా వివిధ కార్యక్రమాలు
- ఈ ఏడాది థీమ్ 'తల్లి, నవజాత శిశువు ఆరోగ్యం'



సుభాష్‌నగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, జీవన శైలి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. పౌష్టికాహారం, వ్యాయామంపై వ్యక్తిగతంగా దృష్టిపెట్టాలి. పోటీ ప్రపంచంలో ఆరోగ్యం గురించి ఆలోచించకుండా మానవాళి పరుగులు పెడుతోంది. దీంతో అనారోగ్యం బారిన పడుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరమని డబ్ల్యూహెచ్‌వో భావించింది. ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ప్రజలను ఆరోగ్యకరమైన అలవాట్ల వైపు ప్రోత్సహించడం, ఆరోగ్య వనరులు అందరికి చేరేలా చేయడం ద్వారా ఆయుష్షును పెరగడం వంటివి సాధ్యమని పేర్కొంటోంది. ముఖ్యంగా యువతకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను నిరవారించడానికి వివిధ అంశాలతో యువతను లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టింది. ఆరోగ్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడానికి, మెరుగుపరచాడానికి సంస్థ ప్రోత్సాహం అందిస్తోంది.

**● అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే..**

అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని విషయాలను పాటించాలని సూచించింది. దినచర్యలో భాగంగా కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ఇ లా చేయకపోతే ప్రజలు ఊబకాయం, బద్ధకం, నీరసం, మధు మేహం వంటి రోగాల బారినపడతారు. ప్రతీ రోజు గంట వ్యాయామం చేస్తే మనిషి ఆరోగ్యంగా జీవించగలడని సంస్థ పేర్కొంది.

**● మాతాశిశు ఆరోగ్య సంరక్షణ**

ఈ సంవత్సరం తల్లి, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై డబ్ల్యూహెచ్ వో దృష్టి సారించింది. ఏడాది పొడవునా తల్లి నవజాత శిశుల మర ణాలను నివారించడం, అవగాహన పెంపొందించడం, గర్భదారణ సమ యంలో మాత్రమే కాకుండా దీర్ఘకాలికంగా మహిళలు, శిశువుల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపర్చడం వంటివి లక్ష్యంగా పెట్టుకుంది. గర్భం, ప్రసవాలకు సంబంధించిన సమస్యలతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా 30 లక్షల మంది మహిళలు మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే రెండు మిలి యన్లకు పైగా శిశువులు పుట్టిన మొదటి నెలలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. సరైన జాగ్రత్తలతో ఈ మరణాలను నివారించవచ్చని సంస్థ వెల్లడించింది. ఈ ఆందోళనకరమైన లెక్కలు తల్లి, నవజాత శిశవుల ఆరోగ్యం కోసం పోరాటం ఇంకా ముగియలేదనే విషయాన్ని మనకు గుర్తు చేస్తున్నాయి. కేవలం ప్రసవాలపైనే కాకుండా ప్రసవం తరువాత మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా దృష్టి కేంద్రీకరించాలి. తల్లులు, నవజాత శిశువుల విభిన్న అవసరాలను తీర్చడానికి ఆరోగ్య వ్యవస్థలు అభివృద్ధి చెందాలి.

## ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకుడు చిలుక శంకర్

జ్యోతినగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఏరియా ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టియు అనుబంధ రామగుండం ఏరియా మోటార్‌వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆదివారం మోటార్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఇఫ్టూ కార్యాలయంలో జరిగింది. ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ట్రాక్టర్ డ్రైవర్లకు నెలకు రూ.24000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.15,100 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయన్నారు. గతంలో కుదుర్చుకున్న వేతన ఒప్పందం ఈనెల30తో ముగుస్తున్నందున కొత్త వేతన ఒప్పందం చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రతి డ్రైవర్‌కు సంవత్సరానికి ఒక జత యూనిఫాం(రూ 5వేలు), రెయిన్ కోటు, బూట్లు, హెల్మెట్ ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. బోనస్, లీవులు, ప్రమాదంలో గాయపడితే డ్రైవర్‌కు పూర్తిస్థాయి చికిత్స చేయించాలని, ఆకాలానికి వేతనంచెల్లించాలని తీర్మానించారు. సమావేశంలో యూనియన్ నాయకులు గుండురాజన్న, బి.కొమురన్న, బి.శ్రీనివాస్, సురేష్, తిరుపతి, కుమారస్వామి, సంజీవ్,రమేష్ పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు

కల్యాణానికి హాజరైన శివసత్తులు

- రాజన్న సన్నిధిలో రామయ్య కల్యాణ ఘట్టం
- కనులారా వీక్షించి పులకించిన భక్తజనం
- పట్టువస్త్రాలను సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

# కమనీయం.. రామయ్య కల్యాణం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసంద్రమైన వేములవాడ రాజన్న క్షేత్రం భక్తి భావంతో ఉప్పొంగింది. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కన్నుల పండువలా నిర్వ హించారు. రాజన్న సన్నిధిలో నిర్వహించిన రామయ్య కల్యాణ తంతును కనులారా వీక్షించిన భక్తజనం పులకించిపోయారు. రాజన్న ఆలయంలో శ్రీరామనవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీరాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలోని మూలవిరాట్టు మూర్తులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను భక్తుల కోలాహలం, మంగళ వాయిద్యాల, కోలాటాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శ్రీసీతారామచంద్ర స్వామివార్ల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా అత్యంత వైభవంగా జరిపించారు. రాచంద్ర స్వామి గొప్పతనాన్ని వర్ణిస్తూ, సీతమ్మతల్లి అణకువను వివరిస్తూ కల్యాణతంతు అంగరంగవైభవంగా సాగింది. కాగా సీతారాముల కల్యాణ మహోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శ్రీసీతారాముల కల్యాణఘట్టం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది.

**భారీగా తరలివచ్చిన భక్తులు..**

వేములవాడ రాజన్న ఆలయంలో అంగ రంగ వైభవంగా నిర్వ హించిన శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్స వానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం రాత్రి భక్తులు తరలివచ్చి రాజన్న ఆలయ వసతి గదులతో పాటుగా ఆలయ ఆవరణలో విడిది చేశారు. సుమారుగా 50 వేలకు పైగా భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయాధికా రులు అంచనా వేస్తున్నారు. కల్యాణాన్ని తిలకిం చేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ అధికారులు చల్లని నీటిని, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. భక్తులు వీక్షించేం దుకు ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో రాజన్న ఆలయ ప్రాంగాణం, ఆవరణతో పాటుగా పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. దీంతో భక్తులు శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించు కున్నారు.



కల్యాణం కోసం తీసుకువచ్చిన మంగళసూత్రం

**● స్వామివారిని పెళ్లాడిన హిజ్రాలు..**

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన సీతారామచంద్ర స్వామి దివ్య కల్యాణమహోత్సవానికి పెద్ద సంఖ్యలో ధారణ చేసుకున్న శివపార్వతులతో పాటుగా హిజ్రాలు తరలించ్చారు. అర్చకులు స్వామివారి కల్యాణ తంతు జరుపుతున్న సమయంలో శివపార్వతులు, హిజ్రాలు ఒకరిపై ఒకరు జిలకర్రబెల్లం పెడుతూ, మంగళసూత్రాన్ని మెడలో కట్టుకుంటూ తలంబ్రాలు చల్లుకుంటూ శ్రీస్వామి వారిని మనువాడినట్లు స్మరించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.



తలంబ్రాలు పోసుకుంటున్న హిజ్రాలు

ఒకరిని ఒకరు పెళ్లి చేసుకుంటున్న హిజ్రాలు

## పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే శ్రీసీతారామంచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్-వనజ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీస్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు సుఖసంతోషాలతో, పాడిపంటలతో కాలకాలం వర్థిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు కళకళలాడాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. స్వామివారికి రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌లు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తరఫున బీజేపీ నాయకులు పట్టువస్త్రాలను సమర్పించారు. కాగా ఎస్పీ మహేష్ బి. గితే దర్శించుకోగా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. టౌన్ సీఐ వీరప్రసాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఏనుగు మనోహర్‌రెడ్డి, నాగం కుమార్, రొండి రాజు, కనికరపు రాకేష్‌తో పాటుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శ్రీస్వామి వారిని దర్శించుకుని తరించారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, కమిషనర్ అన్వేష్



స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# నేత్రపర్వంగా స్వామివారి రథోత్సవం

- ఉత్సాహంగా కొనసాగిన శోభాయాత్ర
- నృత్యం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సీతారాములు కల్యాణం వైభోవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పల్లకీ మోసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవం మీద కొలువుదీరిన ఉత్సవమూర్తులను పట్టణ వీధుల్లో ఊరేగింపుగా నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమానికి భారీ సంఖ్య లో భక్తులు హాజరయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రథోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి కుంకుమ చల్లుతూ ఉత్సహంగా కని పించారు. భక్తులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఎత్తుకుని నృత్యాలు చేశారు.

**● ఆకట్టుకున్న హిజ్రాల నృత్యాలు..**

సీతారాముల కల్యాణం అనంతరం సాయంత్రం స్వామివారి రథోత్సవంలో హిజ్రాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవం ముందు డీజే సౌండ్స్, డప్పుచప్పుళ్ల మధ్య హిజ్రాలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాం



నృత్యం చేస్తున్న హిజ్రాలు

# సప్తశతిలో డాక్టర్ నలిమెల సప్త పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సాహితీ సోపతి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ రాసిన ఏడు పుస్తకాలను ఆదివారం ఫిలింభవన్‌లో ఆవిష్కరించారు. 2002 నుంచి ఫేస్‌బుక్‌లో తెలంగాణ భాష, సాహిత్యంపై సమాలోచనంగా రాసిన 'మాటల మూటలు' పుస్తకాన్ని కవి, సీనియర్ పాత్రికేయుడు నగునూరి శేఖర్ ఆవిష్కరించారు. ఆ పుస్తకాన్ని చిన్ననాడు పాలు ఇచ్చి పెంచిన తల్లి నరసవ్వకు అంకితమిచ్చారు. భాస్కర్ 17వ సంవత్సరంలో రాసుకున్న 'ప్రణయ హృదయాలు' నవలను కవి, విమర్శకుడు అన్నాడి గజేందర్‌రెడ్డి ఆవి ష్కరించారు. 'చెలిమెలు' పుస్తకాన్ని కవి, కాలమిస్ట్ అన్నవరం దేవేందర్ ఆవిష్కరిం చగా కామారెడ్డిలో అద్దెకు ఉన్న ఆకుల నరసింహులుకు అంకితమిచ్చారు. 'ఆరు బెంగాలి కథలు' పుస్తకాన్ని కవి, గాయకుడు గాజోజు నాగభూషణం ఆవిష్కరించగా ఇంటి ఎదురుగాఉన్న భాస్కర్‌కు ప్రేరణ కల్గించిన ఎల్.నారాయణకు అంకితమిచ్చారు. 'తెలుగు క్రియా పదకోశం' అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లు ఆవిష్కరంచగా కోలా విజయ సాయికి అంకితమిచ్చారు. తెలంగాణ మాస పత్రికకకు శీర్షికగారాసిన 'తెలంగాణ పలుకుబడి' వ్యాసాలను రచయిత కందుకూరి అంజయ్య ఆవిష్కరించగా ఎర్రం రాగులన్నకు అంకితమిచ్చారు. చతురలో వచ్చిన కన్నడ అనువాద నవల 'కుండి' పుస్తకాన్ని రచయిత కూకట్ల తిరుపతి ఆవిష్కరించగా నిజాం వెంకటేశంకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో 200 పుస్తకాలు చదివానని, పీఎస్ రవీంద్ర పరిచయం చేసిన తర్వాత నలిమెల భాస్కర్ రచనలు చదివానని అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం భాస్కర్ సొంతమన్నారు. కరీంనగర్‌లో కొత్త తరాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఎన్నీల ముచ్చట్లు ప్రారంభించి నవకవి తరానికి నాంది పలికారన్నారు. జూకంటి జగన్నాథం, పొన్నం రవిచంద్ర, పెద్దింటి అశోక్‌కుమార్, రంగినేని మోహన్ రావు, పిఎస్ రవీంద్ర, మాడిశెట్టి గోపాల్, డాక్టర్ వాసరవేని పర్శరాం, మనోహర్‌రెడ్డి, మోత్కుల నారాయణ, బూర దేవానందం, మద్దికుంట లక్ష్మణ్, తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి అన్నవరం దేవేందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మధుశ్రీ, పెనుగొండ సరసిజ, గుండు రమణయ్య, సీవీ కుమార్, దాయరకుంట శంకరయ్య, పెనుగొండ బసవేశ్వర్, నడిమెట్ల రామయ్య, నసీరొద్దీన్, వరప్రసాద్, తిరుపతి, సుజాత, వేణు, డాక్టర్ మచ్చ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌తో తల్లి మృతి

**● చికిత్స పొందుతున్న కుమారుడు**

రుద్రంగి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో తల్లి మృతిచెందగా కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత(35), కుమారుడు నిహాల్(6) ఈ నెల 4న రాత్రి గోదుమ రొట్టెలు తిన్నారు. అయితే అదే రాత్రి వాంతులు విరోచనాలు కావడంతో స్థానికంగా చికిత్స అందించారు. ఉదయం మళ్లీ తల్లీ, కుమారుడు అస్వస్థతకు గురికావడంతో వెంటనే కోరుట్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తల్లి పుష్పలత మృతిచెందింది. కుమారుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఏంజీఏం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.

## శ్రీరాముడి కృప అందరిపై ఉండాలి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్ర స్వామి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆధ్యాత్మిక వేత్త రాధామనోహర్‌దాస్ అన్నారు. కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రామనవమి నుంచి మరో రామనవమి వరకు రామాయణం చదవాలని సూచించారు. ఇంట్లో పుస్తకం లేకపోతే కొనుక్కోవాలన్నారు. మనిషై పుట్టిన వాడు మరణించే లోపు ఒక్కసారైనా పూర్తిగా భగవద్గీత చదవాలన్నారు. శ్రీరామనవమికి ముందు మన ప్రధాని రామాలయం ఇచ్చారని, మనజెండా ఎగరని స్థలంలో జెండా ఎగురేశార న్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో మన జెండా ఎగురవేయడంతోపాటు దీపావళి వేడుకలు జరుపుకుంటున్నారని అన్నారు. స్నానం, ధ్యానం,జ్ఞానం మరువకూడదని అన్నారు. ఎక్కడ తింటున్నామో, ఎక్కడ కొంటున్నామో కశ్చితంగా చూసుకోవాలని సూచించారు. లేక పోతే మన ధర్మానికి హాని జరుగుతుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధారులున్న ధర్మం మనదని అన్నారు. ఎవిడెన్స్, ఎథిక్స్, ఎఫిక్స్ ఉన్నవి కనుకనే భారత దేశాన్ని ప్రపంచంలో ఏ దేశం కూడా దోచుకోలేదని అన్నారు. సర్వే జనా సుఖినో భవంతు అనే కాన్సెప్ట్ మన బ్లడ్‌లో, హెడ్‌లో, ఈ మట్టిలో ఉందని అన్నారు. భారత్ బాగుండాలంటే హిందువులు బాగుండాలని తెలిపారు.



కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ప్రసంగిస్తున్న రాధామనోహర్‌దాస్



తలంబ్రాల వేడుక

# కల్యాణం.. కమనీయం..

## భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

## శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మంథనిరూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక, గాజులపల్లి గ్రామాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టడంతో మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పేద ప్రజలు సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో రేషన్‌షాపుల ద్వారా ప్రభుత్వం అందిస్తుందని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. చాట్లపల్లి సంతోష్, ఐలి శ్రీనివాస్, వెంకటేశం, రాజేశం. రవి, ప్రవీణ్, రాజబాబు, హుస్సేన్‌లు పాల్గొన్నారు.

### పుట్ట నారాయణ వర్ధంతి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ వర్ధంతి ఆదివారం గోదావరిఖనిలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో నిర్వహించారు. పుట్ట నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. ముస్త్యాల గ్రామానికి చెందిన నారాయణ జీడీకే 6 ఇంక్లయిన్‌లో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు మహిళపై అత్యాచారం చేసి ఆమె భర్తను చంపినందుకు నిరసనలు జరుగుతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో నారాయణ బలయ్యాడని తెలిపారు. నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదన్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీచేశారు. పుట్ట రాజన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఐ ఎరుకల పోశం, కందుల రవి, లక్ష్మీనారాయణ, ఉదయ్, హరీష్, తిరుపతి, నర్సింగరావు పాల్గొన్నారు.

### జేఎన్టీయూలో ముగ్గుల పోటీలు

రామగిరి, ఏప్రిల్ 6: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏఎల్‌పి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు పాల్గొని ముగ్గులు వేశారు. పోటీలకు సేవా ఇంచార్జ్ అధ్యక్షురాలు విజయ వెంకటేశ్వర్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. క్లబ్ సెక్రటరీ సుజాత, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, మారుతీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

### వాటాల తేడాలతోనే బీఆర్ఎస్ నేతల మధ్య వైరం

రామగిరి, ఏప్రిల్ 6: ప్రభుత్వ నిధులు, భూకబ్జాలు, మట్టి, ఇసుక మాఫియాలో వచ్చిన డబ్బుల వాటాల తేడాలతోనే బీఆర్ఎస్ నేతల మధ్య వైరం పెరిగిందని, అందులో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును లాగడం ఎందుకని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొటచంద్రయ్య ఎద్దేవా చేశారు. ఆదివారం ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్టమధు మెప్పు కోసం శ్రీధర్ బాబును విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఎంపీపీ ఆరెల్లిదేవక్క బహిరంగంగా కన్నీటి పర్యంతం కాగా ప్రజలు, అధిష్టానం వద్ద విలువ పోతుందనే భయంతో పక్కదారులు వెతుకుతున్నారని ఆరోపించారు. నాయకులు శ్రీనివాస్, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, కాటంసత్యం, లింగయ్య, ముత్యాలశ్రీనివాస్, రజిత శ్రీనివాస్, నరేష్‌యాదవ్, పాల్గొన్నారు.

### మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం



కుంగ్-ఫూ విద్యార్థులతో ఎస్‌ఐ, కరాటే మాస్టర్స్

ధర్మారం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్-ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టులు, సర్టిఫికెట్స్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కుంగ్-ఫూ కరాటే విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, డ్రాగన్ స్వార్డ్ కుంగ్-ఫూ అకాడమీ గ్రాండ్ మాస్టర్ రాజమల్లు, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, సీనియర్ మాస్టర్లు శ్రీనివాస్, హరికృష్ణ, ప్రసాద్, చందు, లింగంపల్లి రమేష్, వెంకటస్వామి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీవాణి స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్ వార్షికోత్సవం ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్జీ-2 ఎస్వోటూ జీఎం రాముడు పాల్గొని మాట్లాడారు. ప్రీప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రామగిరి ఎంఈఓ కొంరయ్య, ట్రస్మా నాయకుడు రాజయ్య, కరస్పాండంట్ లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

### సన్న బియ్యం పంపిణీ

పాలకుర్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని భామ్లానాయక్ తండాలో ఆదివారం డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. పాత బ్రిడ్జి సమీపంలో ఇటీవల పుల్లె మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను, పోచమ్మవాడకు చెందిన గడి రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, కుమార్, బాలయ్యలు ఉన్నారు.

### అనాథ పిల్లలకు దుస్తులు, అన్నదానం

కమాన్‌పూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపీపీ ఇంగంటి ప్రేమలత తనయుడు రామారావు జన్మదినం సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మ పరివార్ అనాథాశ్రయంలో హెల్పింగ్ హ్యాండ్ నేచర్ ఆధ్వర్యంలో అన్నదానం, పండ్ల పంపిణీతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. నాయకులు పీట్ల గోపాల్, హెల్పింగ్ హ్యాండ్ నేచర్ అధ్యక్షుడు నారగోని సతీష్, సభ్యుడు మేడగోని విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభోగమే...



నిట్టూరు రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రామగిరిలో కల్యాణానికి వస్తున్న గ్రామస్థులు

5వ పేజీ తరువాయి

హనుమాన్ దీక్షాపరులతో ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది.

**మంథని రూరల్ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వెంకటాపూర్, ఆరెంద, ఎక్లాస్‌పూర్, మైదుపల్లి, గుంజపడుగు, నాగారం, దుబ్బపల్లి, ఉప్పట్ల, ఎక్లాస్‌పూర్, రచ్చపల్లి, విలోచవరం, అడవిసోమన్‌పల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను నిర్వహించారు. పలువురు భక్తులు కన్యాదానం చేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

**ముత్తారం, (ఆంధ్రజ్యోతి):** ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు, పారుపల్లి, కేశనపల్లి, లక్కారం, మచ్చపేట, ఖమ్మంపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీజే చప్పుళ్లతో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

**సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఐతరాజుపల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి, సుల్తానాబాద్ పెరికిగిద్ద దేవాలయాలలో జరిగిన స్వామి వారల కల్యాణోత్సవాలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** సుల్తాన్‌పూర్ రామాలయం, ఎలిగేడు కోదండ రామాలయం, ర్యాకల్‌దేవ్‌పల్లి నాగలింగేశ్వరస్వామి, లాలపల్లి మల్లికార్జున స్వామి, నర్సాపూర్, లోకపేట్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. ఆలయాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు అన్నదానం చేశారు. చలువ పందిళ్లు వేసి తాగునీటి వసతి కల్పించారు. సుల్తాన్‌పూర్, ర్యాకల్‌దేవ్‌పల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుగ్యాల సంతోష్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, తిరుపతిగౌడ్, భూమేష్, పాల్గొన్నారు.

**పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి):** మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్,ఆయన సతీమణి మనాలి ఠాకూర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి,పోచం పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి):** కాలనీలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండుగా జరిగాయి. వెంకటేశ్వర ఆలయంలో ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఎస్వోటూ జీఎం రాముడుతో పాటు సింగరేణి అధికారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మనాలి ఠాకూర్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు హేమంత్ కళ్యాణ వేడుకను జరిపించారు. న్యూమారేడుపాకలోని భక్తాంజనేయ ఆలయంలో జరిగిన కల్యాణంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు బెల్లంపానకం, వడపప్పు, పులిహోరలను అందజేశారు.

శ్రీరామ నవమిని సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాలయం నుంచి కాషాయ జెండాలతో హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ జరిగింది. దావ రాజిరెడ్డి, ముత్యాల బాలయ్య, మూకిరి రాజు, ఆకుల శశి, శ్రీనివాస్, అనిల్, బాదె క్రాంతి, చెన్నూరి రమేష్, లింగంనాయక్, ఆమంచి శ్రావణ్, పాల్గొన్నారు.

**అంతర్గాం, (ఆంధ్రజ్యోతి):** గోలివాడ, ఎక్లాస్‌పూర్, కుందనపల్లి, ఆకెనపల్లి తదితర ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్ ఠాకూర్ ఆయా గ్రామాలోని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నియోజకవర్గ ప్రజలు చల్లగా వర్ధిల్లాలని స్వామి వారిని వేడుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంగపల్లి అజయ్, కిషన్, దేవునూరి చంద్రమౌళి, చిర్ర సత్యం, సుద్దాల మూర్తి, జంగపల్లి శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, పాల్గొన్నారు.

**జూలపల్లి, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంతోపాటు తెలుకుంటా, వడుకాపూర్, కోనరావుపేట, వెంకట్రావుపల్లి, కీచులాటపల్లి, తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు జూలపల్లి,తెలుకుంట, కోనరావుపేట గ్రామాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. బొద్దుల లక్ష్మీనర్సయ్య, మెతుకు కాంతయ్య, లోక జలపతిరెడ్డి, బండి స్వామి, దండె వెంకటేశం, సిరికొండ కొమురయ్య, వేల్పుల గట్టయ్య, హన్‌మాన్ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అవసరమైన తాగునీరు, చలువ పందిల్లు, అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

**పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండ స్వచ్ఛంద సేవా సంస్థలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కోదండరామాలయంలో, శ్రీరామ్‌నగర్ ఆలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దంపతులు హాజరయ్యారు. పట్టు వస్త్రాలను పుస్తెమట్టెలను అందించారు. బస్టాండ్ సమీపంలోని హనుమాన్ ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి దంపతులు, మున్సిపల్ మాజీ చైర్మన్ దాసరి మమతారెడ్డిలు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రామాలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు, ఆర్ఎస్ఎస్ బజరంగ్‌దళ్ కార్యకర్తలు, రాజకీయ నాయకులు, స్వచ్ఛందసంస్థలు సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

### సీతారాముల కల్యాణంలో హిజ్రాల సందడి



సుల్తానాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల వివాహం

సుల్తానాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పెరికిగిద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పలువురు హిజ్రాలు పాల్గొన్నారు. సీతారాముల కల్యాణోత్సం రోజునే తాము కూడా కల్యాణం జరుపుకుంటామని పేర్కొన్నారు. వేదికపైన వీరు వివాహం చేసుకున్నారు. పలువురు భక్తులు వీరి ఆశీర్వాదాన్ని తీసుకొని కట్న కానుకలు సమర్పించారు. వివాహం అనంతరం వీరు నృత్యాలు చేశారు.



కాలనీ వేంకటేశ్వరాలయంలో పాల్గొన్న భక్తులు



పెద్దపల్లి కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు, ధర్మారంలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, విలోచవరంలో కల్యాణంలో భక్తులు, కాల్వశ్రీరాంపూర్‌లో ఉత్సవ విగ్రహాలతో భక్తులు

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



ఖని చౌరస్తాలో జెండాను ఆవిష్కరిస్తున్న కందుల సంధ్యారాణి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు మీర్జంపేటలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా పార్టీ జెండా ఎగుర వేసి స్వీట్లు పంపిణీ చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గూడెపు జనార్దన్‌రెడ్డి, నాయకులు చల్ల చంద్రమౌళి, జంగ రాజయ్య, ఉప్పుల కుమార్, మొలకోజు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, రాములు, స్వామి, పాల్గొన్నారు.

**ఓదెల, (ఆంధ్రజ్యోతి):** కనగర్తి, కొలనూర్‌తోపాటు పలు గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ సంబరాలను నిర్వహించారు. గ్రామ కూడళ్లలో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో స్వీట్లను పంపిణీ చేశారు. నాయకులు ఆది సతీష్, తూడి రాజేందర్, కందునూరి మల్లేశం, ఆది రామకృష్ణారావు, రవి, ఆది గంగాధర్, పిట్టల శివ, సంజీవరావు, పాల్గొన్నారు.

**కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి):** బీజేపీ ఆవిర్భావ వేడుకలు గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ప్రధానచౌరస్తాలో జరిగిన కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ భారత్‌ను విశ్వగురువుగా నిలబెట్టడమే లక్ష్యంగా పని చేస్తుందని, 2 ఎంపీ సీట్లతో ప్రారంభమై నేడు ఆజేయశక్తిగా ఎదిగి ప్రపంచానికి దిశనిర్దేశం చేస్తుందని కొనియాడారు. గుండబోయిన భూమయ్య, పిడుగు కృష్ణ, గోగుల రవీందర్, నరహరి, సత్యనారాయణ, తడగొండ నర్సయ్య, రాజేందర్, మహేష్, రాజు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి):** బీజేపీ ఆవిర్భావ వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. కొదురుపాకలో బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేష్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. నాయకులు అజయ్, సట్టు శ్రీనివాస్, సుభాష్, రాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు. సుల్తానాబాద్‌లో పట్టణ శాఖ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు పార్టీ జెండా ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పాల్గొని భరతమాత చిత్రపటానికి పూల మాలలు వేశారు. నాయకులు కడారి అశోక్‌రావు, సౌదరి మహేందర్, భూసారపు సంపత్,తిరుపతి యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో బీజేపీ ఆవిర్భావ వేడుకలను బీజేపీ శ్రేణులు నిర్వహించారు. ముప్పిరితోట, ధూళికట్ట, సులాన్‌పూర్, బురహాన్‌మియాపేట్ తదితర గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ కమిటీ కన్వీనర్ గాదె రంజిత్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ గర్రెపల్లి నారాయణస్వామి, నాయకులు గుజ్జుల మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గంగయ్య, అంజయ్య, పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి):** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కాలనీలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. 17, 18 డివిజన్‌లలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుల్వ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజర పార్టీ పతాకాలను ఆవిష్కరిం చారు. మోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. నాయకులు మూకిరి రాజు, మారెపల్లి శ్రీనివాస్, ఆకుల శశికుమార్, నవీన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గాంధీచౌక్‌లో బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ న్యాయకత్వంలో దేశాభివృద్ధి కోసం బీజేపీ చేస్తున్న కృషిని వివరించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెండాను ఎగురవేసి స్వీట్లు పంచారు. నాయకులు వేంసాని కొమురయ్య, మెండె రాజన్న, గుమ్మడి శంకరయ్య, కోడూరి రాజేశ్వర్, బొడిగె లక్ష్మన్, మారం ఐలయ్య, నిట్టు బీరయ్య, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి):** భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. మోదీ చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆకర్షితులవుతున్నారని, గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఇంటింటికి సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. దండే లక్షీనారాయణ, మచ్చగిరి రాము, మట్ట శంకర్, సాయి, కిషన్ రావు, మల్లారపు అరుణ్‌కుమార్, పాల్గొన్నారు.

**కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** విఠల్‌నగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండావిష్కరించారు. నాయకులుకొమ్మ శ్రీని వాస్, మామిడి రాజేష్, సెంట్రల్ ఫిల్మ్ బోర్డు సభ్యురాలు మాతంగి రేణుక, నాయకులు జనార్ధన్ పాల్గొన్నారు.

### నిబంధనల మేరకే అభివృద్ధి పనుల ప్రొసిడింగ్స్

రామగిరి, ఏప్రిల్ 6: రాజకీయ వైరంలోకి తనను లాగొద్దని ఎంపీడీవో రమేశ్ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి పనులకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల ప్రొసిడింగ్స్ విషయంలో తనను ఇబ్బందులకు గురి చేస్తున్నా రని పేర్కొన్నారు. ఎంపీపీ దేవక్క ఆదేశాల మేరకు ఆమె సమక్ష్యంలోనే ఫిబ్రవరి 8న ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పనుల జాప్యం పై జెడ్‌పీ సీఈవో తనకు మెమో జారీ చేశారన్నారు. పనుల్లో జాప్యంపై తనకు ఇబ్బందిగా మారుతుందని, సీఈవో జారీ చేసిన మెమో కాపీని ఎంపీపీ దృష్టికి తీసికెళ్ళినట్లు పేర్కొన్నారు. పారదర్శకంగా ఉన్నప్పటికి ఇబ్బందులకు గురి చేసేందుకే తనను రాజకీయంగా వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత

రామగిరి, ఏప్రిల్ 6: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నూరి దేవయ్య కూతురు వివాహానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఓసీపీ-2 ఆపరేటర్ కృష్ణనాయక్ కుటుంబానికి క్లబ్ డైరెక్టర్ గంటవెంకటరమణరెడ్డి రూ.3 వేలు, లయన్స్ క్లబ్ సభ్యుడు శ్రావణ్‌కుమార్ అమ్మాయికి వెండి పట్టీలను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోల్మూరిశ్రీనివాస్, నాయకులు టీవి సురేష్, రేండ్లకుమారస్వామి, సంతోష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే భోజనం



సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రామగుండం 41వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో సన్నబియ్యం లబ్దిదారుడి ఇంట్లో ఆదివారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ భోజనం చేశారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసు కున్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల గురించి లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. దొడ్డు బియ్యంపై ఆసక్తి చూపేవారము కాదని, ఇప్పుడు సన్న బియ్యం తినేందుకు ఉపయోగపడుతాయన్నారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పథకాల గురించి కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత యూనిట్లు తమకు ఆర్థికంగా ఉపయోగపడుతున్నాయని పలువురు మహిళలు పేర్కొ న్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వంపై భారం పడుతున్నా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.6కిలోల సన్నబియ్యం అందనున్నద న్నారు. డివిజన్ అధ్యక్షుడు ఫజల్, యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు కుడుదుల శివ, ఎస్‌సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు కమ్మగిరి సంపత్, ఉమారాణి, దేవకరుణ, ఖమర్, దద్దు పాల్గొన్నారు.

## టోర్నమెంట్ విజేత రిలే 'సీ' జట్టు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని 1, 3 ఇంక్లైన్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్‌లో రిలే 'సీ' జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సెంట్రల్ సెక్రటరీ కే స్వామి, స్పాన్సర్ మేకల నాంపల్లి విజేతలకు ట్రోఫీని అందజేశారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు ఇచ్చారు. ఏడు జట్లు, 14 లీగ్ మ్యాచ్‌ల అనంతరం ఆదివారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఫైనల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ సుంకరి నారాయణ, హెచ్ఎంఎస్ పిట్ సెక్రటరీ రాంచందర్, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ సాయి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, అశోక్, రమేష్, సీఐటీయూ నాయకులు డీ సురేష్, జక్కుల శంకర్‌తోపాటు ఆర్గనైజర్లు మల్లికార్జున్, వినయ్‌కుమార్, భరత్, కుమార్, సంతోష్, సతీష్, రమేష్, చందు పాల్గొన్నారు.